వీకే-7 ఓసీ ప్రైవేటీకరణ..?

- ఇంకా పూర్తిస్థాయిలో లభించని అనుమతులు
- ఇప్పటికే ఓబీ వెలికితీత ప్రైవేట్‌కు..
- బొగ్గు ఉత్పత్తి కూడా అప్పగిస్తారనే ప్రచారం


వెంకటేశ్ ఖని-7 ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వెంకటేశ్‌ఖని ఓపెన్‌కాస్ట్ (వీకే-7 ఓసీ) గనిలో ఉత్పత్తి మొదలుకావాలని కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబాలు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ గనిలో ఉత్పత్తి మొదలైతే ఓవర్ బర్డెన్(ఓబీ) వెలికితీత తప్ప ఇతరత్రా పనులన్నీ కంపెనీ ఆధ్వర్యాన చేపడుతారని.. తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని ఆశించారు. కాగా, ఈ గనికి మూడు నెలల కిందట ఫేస్-1 అనుమతులు లభించాయి. ఫేస్-2 అనుమతులు (ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్), ఈసీ అనుమతులు త్వరలో వచ్చే అవకాశముంది. ఈ నేపథ్యాన యాజమాన్యం ఓబీ వెలికితీతే కాక బొగ్గు ఉత్పత్తి పనులు కూడా కాంట్రాక్టుకు ఇవ్వనుందనే ప్రచారంతో సింగరేణి గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ ఆధ్వర్యాన ఆందోళనకు సిద్ధమవుతున్నారు. వీకే-7 ఓపెన్‌కాస్ట్ తెరుచుకుంటే స్థానిక యువతకు ఉపాధి దొరకడంతోపాటు చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు విడిపోయిన కార్మికులు మళ్లీ ఒక చోటకు చేరతారని.. తద్వారా కార్మిక వాడలకు పూర్వవైభవం వస్తుందని భావించగా ఇప్పుడు వారికి నిరాశ ఎదురుకానుందని భావిస్తున్నారు.

లక్ష్యసాధనకు ఊతం..

సింగరేణి సంస్థ ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు రోజుకు 2.7 లక్షల టన్నుల ఉత్పత్తికి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే వీకే-7 ఓసీకి అనుమతులు లభిస్తే రెండు నుంచి మూడు లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుందని భావించారు. కానీ స్టేజ్-1 అనుమతులే లభించడం.. స్టేజ్-2 అనుమతులకు విధించిన షరతులు, మరికొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇవన్నీ పూర్తిచేస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైనా సంస్థ నిర్దేశించుకునే వార్షిక లక్ష్యంలో సుమారు 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది.

ఫారెస్ట్ క్లియరెన్స్‌తోనే ఇబ్బంది

వీకే-7 ఓసీకి సంబంధించి సుమారు 1,114 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 190 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉన్నట్లు అధికారుల అంచనా. దాదాపు 35 ఏళ్ల జీవితకాలం కలిగిన ఈ ఓసీలో సుమారు వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. ఈ గనికి 773 హెక్టార్లలో అటవీభూమి అవసరం ఉంది. ప్రస్తుతం సింగరేణి ఆధీనంలో 341 హెక్టార్ల స్థలం ఉండగా.. ఈ భూమి వివిధ కాలనీల రూపంలో ఉండడంతో అక్కడి నివాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కాగా, అటవీ భూమి సేకరణ జటిలంగా మారిన నేపథ్యాన ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి కేటాయించినా ఆ శాఖ అధికారులు సంతృప్తి పడినట్లుగా లేరనే చర్చ జరుగుతోంది.

అనుమతులు రాకముందే టెండర్లు

ఓసీకి ఏళ్ల కిందటే అనుమతులు వస్తాయని భావించిన యాజమాన్యం రెండేళ్ల కిందట ఓబీ వెలికితీతకు టెండర్‌ను పిలిచి ఖరారు చేసుకుంది. మూడేళ్ల కిందట ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి.. టెండర్లు కూడా ఖరారు చేయడంతో సంస్థ బాధ్యులు కంపెనీపై ఒత్తిడి పెంచుతున్నారు. అనుమతులు రాకముందే టెండర్లు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నిస్తూ.. ఏళ్ల పాటు తామేం చేయాలంటూ ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఇంతలోనే ఓబీతో పాటు బొగ్గు వెలికితీత ఇతర పనులు సైతం ప్రైవేట్‌కు కట్టబెట్టనున్నారనే ప్రచారంతో కార్మికుల్లో ఆందోళన మొదలుకాగా.. కార్మిక సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



సింగరేణికి ఏళ్లుగా కొత్త బావులు దక్కక పరిస్థితి దిగజారుగుతోంది. ఇలాంటప్పుడు చేతికి వచ్చిన గనిలో సంస్థ ఆధ్వర్యాన బొగ్గు తీయాల్సింది పోయి ప్రైవేట్‌కు అప్పగించాలనుకోవడం సరికాదు. ఈ ప్రయత్నాలు విరమించుకోకపోతే ఆందోళనలు చేపడుతాం.

–కొరిమి రాజశేఖర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

ప్రైవేట్ ఆధ్వర్యంలో ఓబీ వెలికితీత



వీకేఓసీ స్టేజ్-2 అనుమతుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి మొదలవుతుందనే నమ్మకం ఉంది. ఇప్పటికే ఓబీ వెలికితీత టెండర్లు ఖరారయ్యాయి. ఇతరత్రా పనుల విషయంలో యాజమాన్యం నిర్ణయం తీసుకోనుంది.

–శాలేం రాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

తొలిరోజు ప్రశాంతం


ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ


పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రం వద్ద విద్యార్థులు

- సజావుగా సాగిన ఇంటర్మీడియట్ పరీక్ష
- పోలీసుల పటిష్ట బందోబస్తు

ఇల్లెందు/పాల్వంచరూరల్/టేకులపల్లి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇల్లెందులో నాలుగు కేంద్రాల్లో నిర్ణీత సమయానికి ముందే విద్యార్థులు హాజరుకాగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ వారిని తనిఖీ చేసి లోపలికి పంపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 279 మందికి 271 మంది, సాహితీ జూనియర్ కళాశాలలో 228 మందికి గానూ 221 మంది, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 127 మందికి 126 మంది, సుదిమళ్ల గురుకుల కళాశాలలో 252 మందికి 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఓ పరీక్ష కేంద్రం వద్దకు పొరపాటున వచ్చిన దివ్యాంగ విద్యార్థిని సీఐ బత్తుల సత్యనారాయణ.. ఓ వ్యక్తి బైక్‌పై తరలించారు. కాగా, పాల్వంచ మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ, కేఎల్‌ఆర్ జూనియర్ కళాశాలల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,093 మంది విద్యార్థులకు గాను 42 మంది గైర్హాజరయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. టేకులపల్లి జూనియర్ కాలేజీలో 110 మంది విద్యార్థులకు గాను 106 మంది హాజరయ్యారని సీఎస్ బసవమ్మ, డీఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

మహిళా న్యాయవాదులకు పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ ప్రారంభించారు. రాష్ట్ర మహిళా కన్వీనర్ చందాల శైలజ, రాష్ట్ర కోకన్వీనర్ వై.మంజులత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 30 మందికి పైగా న్యాయవాదులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ వీక్షించారు. ప్రథమ బహుమతి ఆర్తిమక్కడ్, ద్వితీయ బహుమతి జి.నాగస్రవంతి, తృతీయ బహుమతి కేఆర్‌వే నీలవేణి సాధించారు. కన్సోలేషన్ బహుమతులు ఉషారాణి, జి.శాంత, దాసరి కవిత, ఎం.సంధ్య, లా విద్యార్థిని పి.శరణ్య, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లావణ్య కైవసం చేసుకోగా.. జడ్జి పాటిల్ వసంత్ బహుమతులు అందించారు. ఎస్.ప్రతిభ, పీవీడీ లక్ష్మి, జేవీవీ బాధ్యులు ఆడపాల కస్తూరి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రామారావు, జె.శివరాంప్రసాద్, రమేశ్‌కుమార్ మక్కడ్, కిషన్‌రావు, కె.పురుషోత్తమరావు, కె.పుల్లయ్య, ఆర్.రామారావు, డి.రవికుమార్, కాంతయ్య, ఎండీ సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

'మహిళలను మభ్యపెడుతున్న సర్కార్'


పోస్టుకార్డులతో బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మహిళలను కాంగ్రెస్ సర్కార్ మభ్యపెట్టి, మోసం చేస్తోందని, మహిళా దినోత్సవం నాడు మహిళలకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చెర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి మద్దతుగా ఆమె విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8లోగా మహిళలకు నెలకు రూ.2,500, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం వంటి హామీలపై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారని, జాగృతి ఆధ్వర్యంలో 10,000 పోస్టుకార్డులను సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారన్నారు. కార్యక్రమంలో తొగరు రాజశేఖర్, హుస్సేన్, జయరాం, సరేందర్, ఖాజాబాషా, షరీఫ్, లావుడ్యా సత్యనారాయణ, జి.శ్రీనివాస్, షమ్మీ, వేముల ప్రసాద్, మద్దెల సుధీర్, రాజారాణి, భారతి, రాజమ్మ, రాణి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'రాయల' ఆశయ సాధనకు కృషి


సింగరేణి(కొత్తగూడెం): వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు


జూలూరుపాడు: సమావేశంలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకుడు ఆవునూరి మధు

ఇల్లెందురూరల్/సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు రూరల్/టేకులపల్లి/జూలూరుపాడు: సుదీర్ఘకాలం అజ్ఞాత జీవితం గడిపి ఏజెన్సీలో విప్లవోద్యమాలు నిర్మించిన రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 9న ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో.. ఈ నెల 11న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. పలుచోట్ల సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మాస్‌లైన్, ఎన్డీ నేతలు జూకంటి గాంధీ, బుర్ర రాఘవులు, అజ్మీర బిచ్చా, గాదె సత్యనారాయణ, తేనె లక్ష్మయ్య, కనకం సత్యం, ఇస్లావత్ కోటేశ్, లక్ష్మయ్య, వాంకుడోత్ శంకర్, జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మ, పెద్దబోయిన సతీశ్, వై.గోపాల్‌రావు, చంద్రశేఖర్, సంధ్య, శాంత, కవిత, రాజేశ్వరి, సునీత, జవహర్‌లాల్, మంగ, పోచం, గంగా, చంద్రకళ, రమేశ్, రామకృష్ణ, కల్తీ వెంకటేశ్వర్లు, భూక్యా హర్ష్య, ఎట్టి నరసింహారావు, భూక్యా నర్సింగ్, నోముల భానుచందర్, పూనెం సమ్మయ్య, మేకల వినోద్, బోడ మంచా, మంగీలాల్, కిర్యా, బాలు, శంకర్, రామస్వామి, నాగేశ్వరరావు, ఆవునూరి మధు, కె.లక్ష్మీనారాయణ, రవి, ఎస్కే ఖాసీం, వల్లోజి రమేశ్ పాల్గొన్నారు.

వీకే-7 ఓసీ ప్రైవేటీకరణ ఆపాలి


ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): వీకే-7ఓసీ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ఏఐటీయూసీ నాయకులు ఆర్‌సీహెచ్‌పీ వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం సీహెచ్‌పీ హెచ్‌ఓడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ.. వీకే-7ఓసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. జి.వీరస్వామి, గట్టయ్య, కత్తెర్ల రాములు, మధు, కృష్ణ పాల్గొన్నారు.

స్పష్టమైన భవిష్యత్ ప్రణాళిక ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: స్పష్టమైన భవిష్యత్ ప్రణాళిక ఎంచుకుని ముందుకు సాగాలని డీఎస్పీ చంద్రభాను విద్యార్థులకు సూచించారు. మండలంలోని రొంపేడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి పూర్తవగానే భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా అడుగులు వేయాల్సి ఉంటుందని, ఆ సమయంలో తప్పు చేస్తే అది జీవితంపై ప్రభావం చూపుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏటీడీఓ రాధ, హెచ్‌ఎం పద్మ, నామనాయక్, సీడీపీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.విజయ్‌భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను బుధవారం ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. మెనూ, నాణ్యత ఎలా ఉంది? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం కోడిగుడ్లు పెట్టాల్సి ఉండగా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ వెంట కళాశాల ప్రిన్సిపాల్ టి.అనిల్, వైస్ ప్రిన్సిపాల్ అన్వేశ్, ఏపీఓ రంగా, కేర్ టేకర్ పాషా, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ పాఠశాలగా ముత్తారపుకట్ట


ముత్తారపుకట్ట పాఠశాల ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: మండలంలోని ముత్తారపుకట్ట ఎంపీపీఎస్‌ను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారు. బుధవారం జేబీఎస్ పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా కార్యక్రమంలో కాంప్లెక్సు స్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపీపీఎస్ ముత్తారపుకట్టను హెచ్‌ఎం లలిత ప్రకటించారు. జిల్లా అధికారులు నిర్ణయించిన ఏడు అంశాల్లో ముత్తారపుకట్ట పాఠశాల ఉత్తమంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ముత్తారపుకట్ట పాఠశాల హెచ్‌ఎం కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు ఆరెం రవికుమార్‌ను ఎంఈఓ స్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎం లలిత, ఎఫ్‌ఎల్‌ఎన్ ఆర్పీలు రాజు, శిరీష, సెక్రెటరీ కె.కృష్ణయ్య తదితరులు సత్కరించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి కుర్చీల వితరణ


ఐరన్ కుర్చీలను అందిస్తున్న అబ్బాస్

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు వేచి ఉండేందుకు కుర్చీలను వితరణగా అందించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీపీఎస్ రిటైర్డ్ ఫోర్‌మెన్ అబ్బాస్ తన భార్య సాయల్ సుల్తాన్ జ్ఞాపకార్థం రూ.12 వేల విలువ చేసే ఐరన్ కుర్చీలను సూపరింటెండెంట్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాస్, చారి, కందికొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతికి సంతాపం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంనకు చెందిన ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికుడు మొండయ్య (55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా పలువురు నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, కంచర్ల జమలయ్య, గుంటి రాజయ్య, లాల్‌మీయా, చాతిరి రమణయ్య, పితాని జయప్రకాష్, బైరీ శ్యాంనారాయణ, రమేశ్, దాసారపు శివ, రావూరి వెంకట్రావు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

మాజీ వార్డు కౌన్సిలర్‌కు..

ఇల్లెందు: మాజీ వార్డు కౌన్సిలర్ మాచర్ల చంద్రమౌళిగౌడ్ ఇటీవల మృతిచెందగా బుధవారం పట్టణంలోని జగదాంబాసెంటర్ ఏక్తాభవన్‌లో ఏర్పాటు సంతాపసభ నిర్వహించారు. దిండిగాల రాజేందర్, మడత వెంకట్‌గౌడ్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు బంధం నాగయ్య, బాస శ్రీనివాస్, ఎస్.రంగనాథ్, అబ్దుల్ నబీ, యాకుబ్‌షావలి, సుదర్శన్‌కోరీ, ముద్రగడ వంశీ, చాందావత్ రమేశ్‌బాబు, మల్లెల వెంకటేశ్వర్లు, కొత్త వెంకటేశ్వర్లు, ఏక్తా భవన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


సోమమ్మ (ఫైల్)

పాల్వంచరూరల్: శతాధిక వృద్ధురాలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మండలంలోని సోములగూడెం గ్రామానికి చెందిన వల్లపు సోమమ్మ స్వగృహంలో మృతి చెందగా పలువురు నివాళులర్పించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, సుమారు 50 మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు.

ఇలానా తీసుకెళ్లేది..?


ట్రాలీలో విద్యార్థులను తీసుకెళ్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ట్రాలీ ఆటోలో ప్రమాదకర స్థితిలో తీసుకెళ్లడం విమర్శలకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి.. ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశాల మేరకు బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. కోయగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్లు ట్రాలీల్లో ఎక్కించారు. కొందరు విద్యార్థులు టాప్‌పైన ప్రమాదకరంగా కూర్చున్నప్పటికీ నియంత్రించకపోవడం గమనార్హం. ఈ విషయమై ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అమర్‌సింగ్‌ను వివరణ కోరగా.. అందుబాటులో ఉన్న వాహనాలను ఏర్పాటు చేశామని, ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు.

క్లుప్తంగా

పాలక మండళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలి


మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: దేవస్థానాల పాలకమండళ్లలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండాలతో సంబంధం లేని ఉద్యమకారులను నామినేటెడ్ స్థానాల్లో నియమించాలన్నారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి, అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి, పాల్వంచలోని పెద్దమ్మతల్లి దేవస్థానాల పాలకమండళ్లలో స్థానం కల్పించే దిశగా ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో దేవులపల్లి రాంమూర్తి, శ్రీనివాస్, కిరణ్, కాకెల్లి సైమన్, ఎం.వలీబాబు, సప్తార్‌బేగ్, సలీం, సంగీతరావు, కవిత, కాటబోయిన మల్లయ్య, కొమ్ము వీరస్వామి, ఎస్.కే.జానీమియా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళలకు ఆటల పోటీలు


పోటీల్లో పాల్గొననున్న మహిళలు

టేకులపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సేవా అధ్యక్షురాలు వి.రమ ఆదేశాలతో సింగరేణి ఉద్యోగుల కుటుంబాల మహిళలకు టేకులపల్లి సింగరేణికాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మార్చి 8న ఇల్లెందు జేకేకాలనీలోని సీఈఆర్‌క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ఇస్తారని యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో శ్రీవాణి, అజయ్, వేణు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు ప్రారంభించిన క్రైస్తవులు


ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఇల్లెందురూరల్: ఏసు సిలువ మరణాన్ని గుర్తు చేసుకుంటూ మండలంలోని క్రైస్తవులు బుధవారం నుంచి భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. పలు గ్రామాల్లో ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు సందేశం ఇచ్చారు. అనంతరం ఉపవాసం ఆచరించేందుకు ముందుకొచ్చిన భక్తులు చర్చి పాస్టర్ల ద్వారా దీక్షలను స్వీకరించారు. లెంట్ డేస్‌గా భావించే 40 రోజులపాటు ఉపవాస దీక్షలను కఠినంగా ఆచరించాల్సి ఉంటుంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చి పాస్టర్లు బోధించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఇల్లెందు: ఓ విద్యార్థిని పరీక్ష ఫీజు కోసం టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు బుధవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని విజయలక్ష్మీనగర్ పంచాయతీ శేషగిరినగర్‌బస్తీ వాసి కడెం సాంబమూర్తి కుమార్తె జీవనశ్రీ బీఎస్సీ నర్సింగ్ నాలుగో సంవత్సరం చదువుతుండగా పరీక్ష ఫీజు చెల్లించే స్తోమత లేకపోవటంతో చదువుకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు చాందావత్ రమేశ్‌బాబు, మెట్టెల రత్నాకర్ ముద్రగడ వంశీని సంప్రదించటంతో జీవనశ్రీ చదువు కోసం రూ.10 వేలు అందజేయగా.. ఆ డబ్బును విద్యార్థినికి అందించారు. కార్యక్రమంలో శ్యామ్, పాదిలి శ్యామ్, బాబు, గోపాలకృష్ణ, నాగరాజు, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు ఐటీఐ మంజూరు

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు సన్నాహాలు సాగుతున్నాయి. ఇల్లెందుకు ఐదు ట్రేడ్‌లతో ఐటీఐ మంజూరు చేయగా ప్రతీ ట్రేడ్‌కు 40 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేగాక ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను కూడా కేటాయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పైఅంతస్తులో తొలి విద్యాసంవత్సరం ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సమాలోచనలు చేస్తున్నారు. దీంతో ఇల్లెందు ఏరియా నిరుద్యోగుల కల నెరవేరినట్లయింది. ఐటీఐ మంజూరు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.